క్లుప్తంగా

నేటి నుంచి ఉచిత వినికిడి పరీక్షలు

వనస్థలిపురం: వనస్థలిపురం పనామా డబుల్ రోడ్డులోని హియర్‌వెల్ స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఉచిత వినికిడి పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరం ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహిస్తారని, చెవి మిషన్లపై ఆకర్షణీయమైన తగ్గింపు ఉంటుందన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

సైదాబాద్: శాంతిభద్రతల పరిరక్షణలో కాలనీల వాసులు పోలీసులకు సహకరించాలని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవి అన్నారు. సైదాబాద్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.రవిని గురువారం పలువురు కాలనీవాసులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రీన్‌పార్క్ కాలనీకి చెందిన జూలూరు శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో కాలనీవాసులు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చిశుభాకాంక్షలు తెలిపారు. ఆంజనేయులు గుప్తా, ఆర్.శ్రీధర్, కొలం శ్రీనివాసరెడ్డి, శ్రవణ్‌కుమార్ రెడ్డి, ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.

గాలికి కారుపై కూలిపడ్డ చెట్టు

నాగోలు: గాలికి వేప చెట్టు కూలి కారుపై పడటంతో కారు ధ్వంసమైన ఘటన కొత్తపేటలో గురువారం ఉదయం జరిగింది. కొత్తపేట ప్రాంతంలో నివాసం ఉండే గౌతమ్ చాంద్‌జీ గాంధీ తన ముగ్గురు కుటుంబసభ్యులతో కలిసి కొత్తపేటలోని ఆలయానికి వచ్చారు. పూజలు ముగించుకొని వెళ్తుండగా రోడ్డు పక్క ఉన్న పురాతనమైన చెట్టు గాలికి కూలి కారుపై పడింది. కారులో ఉన్న వారికి అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటనలో కారు ముందు భాగం కొంత వంగిపోయింది. విషయం తెలుసుకున్న కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ హుటాహుటిన ఘటనా స్థలికి వచ్చారు. డీఆర్ఎఫ్, విద్యుత్ శాఖ పిలిపించి చెట్టుని కొట్టించి అక్కడి నుంచి తీయించారు. తెగిపోయిన విద్యుత్ తీగలను సరిచేయించారు.

చెట్లను కూల్చివేసిన వారిపై కేసు నమోదు

హస్తినాపురం: నాగార్జునసాగర్ రోడ్డులోని పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీలోని నర్సరీలో ఉన్న పెద్ద పెద్దచెట్లను గుర్తు తెలియన వ్యక్తులు కూల్చివేశారని సెంటర్‌ఫర్ సోషియోకల్చర్ అండ్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ సీఈఓ సన్ని హెరాక్లియస్ వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెట్లను కూల్చివేసిన వారిపై చట్టపరంగా తీసుకోవాలని వనస్థలిపురం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. చెట్లను కూల్చివేయడంతో పాటు నర్సరీ కార్యాలయంలో ఉన్న కంప్యూటర్‌ను కూడా పూర్తిగా ధ్వంసం చేశారని, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఈ విషయమై వనస్థలిపురం పోలీసులను వివరణ కోరగా.. నర్సరీలోని చెట్లను కూల్చివేసిన వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ నర్సింగ్ రాథోడ్ వెల్లడించారు.

రోడ్ల మరమ్మతుపై నిర్లక్ష్యం వద్దు

ఎల్‌బీనగర్: అభివృద్ధి పనులు పూర్తైన వెంటనే రోడ్లకు మరమ్మతు చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎన్జీఓస్ కాలనీలో డ్రైనేజీ పనులు పూర్తయినా రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలనీవాసులు ఈ విషయాన్ని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ గురువారం వాటర్ వర్క్స్ డీజీఎం రాజగోపాల్‌తో కలిసి రోడ్డును పరిశీలించారు. త్వరలో కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులను కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ భవ్య, నాయకులు జైపాల్‌రెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

రాజకీయాల్లోకి చీకోటి ప్రవీణ్?



సైదాబాద్: ధర్మరక్షణ సంస్థ ఫౌండర్ చైర్మన్ చీకోటి ప్రవీణ్ బీజేపీలో చేరనున్నట్టు ప్రచారం జరుగుతోంది. గురువారం ఆయన ఢిల్లీలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావుతో పాటు పలువురు జాతీయ నాయకులను కలిశారు. ఈ విషయం సోషల్ మీడియాలో కూడా వైరల్ అయింది. చీకోటి బీజేపీ జాతీయ నాయకులను కలవడం ఆయన రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారానికి ఊతమిస్తోంది.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెంపొందించాలి

మలక్‌పేట: ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు అభ్యసన సామర్థ్యం కలిగి ఉండేలా తీర్చిదిద్దాలని సైదాబాద్ మండల డిప్యూటీ ఈఓ తిరునగరి రాధాకృష్ణ అన్నారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా గురువారం మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన తెలుగులో శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తాము విన్న అంశాలను పాఠశాలలో అమలు చేసి విద్యార్థులందరికీ చదవడం, రాయడం వచ్చేలా చేయాలని కోరారు. కార్యక్రమానికి పరిశీలకులుగా రాష్ట్ర రిసోర్స్ పర్సన్స్ ఎల్ఎన్ ప్రసాద్, ఉదయ్ కుమార్ హాజరుకాగా, . తెలుగు ఆర్పీలు ఉమా, లక్ష్మీదేవి, అరుణ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జర జాగ్రత్త

- ఆసుపత్రులకు పెరిగిన రోగుల తాకిడి
- పెరుగుతున్న కళ్ల కలక బాధితులు

వనస్థలిపురం ఆసుపత్రిలో రోగులు కిటకిట



వనస్థలిపురం: వర్షాకాలంలో ఎన్నో వ్యాధులు ప్రబలుతుంటాయి. జ్వరం, జలుబు, దగ్గు, దమ్ము, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రజలను పట్టి పీడిస్తుంటాయి. సీజనల్ వ్యాధులతో ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరుగుతోంది. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కళ్ల కలక కలకలం సృష్టిస్తోంది. రోజు రోజుకూ దీనిని బాధితుల సంఖ్య పెరుగుతోంది.

- గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు, చలిగాలులతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల వచ్చే వ్యాధుల బారిన పడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆరోగ్యపరంగా ఏవైనా మార్పులు కనిపిస్తే సమీపంలోని ఆసుపత్రులను, వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- ప్రతి రోజూ ఎప్పటికప్పుడు వేడి వేడిగా ఆహారం వండుకొని తినాలి
- ఇంటి పరిసరాలు, ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- దోమలు, ఈగలు వాలకుండా, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- అవసరం ఉంటేనే బయటికి వెళ్లాలి. వృద్ధులు, మహిళలు, పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- నిత్యం గోరువెచ్చని నీటినే తాగాలి, ఫ్రిజ్‌లోని ఆహారాన్ని తినవద్దు. ఐస్ క్రీం, జంక్‌ఫుడ్‌లకు దూరంగా ఉండాలి.
- ప్రతి రోజూ వ్యాయామం, యోగా, వాకింగ్ వంటి వాటిలో ఏదో ఒకటి తప్పకుండా చేయాలి. మిత ఆహారం తీసుకోవాలి.
- ఆహార పదార్థాలను తీసుకునే ముందు చేతులు శుభ్రపర్చుకోవాలి

కళ్ల కలక బాధితుల సంఖ్య పెరుగుతోంది

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు పెరగడం సహజం. వాతావరణంలో మార్పుల కారణంగా ఇన్‌ఫెక్షన్‌తో పలు రకాల వ్యాధులు ప్రబలుతుంటాయి. ప్రస్తుతం కళ్ల కలక బాధితులు పెరుగుతున్నారు. కళ్ల కలక అంటువ్యాధి కావడంతో త్వరగా వ్యాప్తి చెందుతోంది. వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి నిత్యం ఓపీ పేషంట్లు 600 నుంచి 700 వరకు వస్తుంటారు. కళ్ల కలకతో ఇప్పుడు ప్రతిరోజూ మరో 100 మంది వరకు అదనంగా వస్తున్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి.

– ఆర్ఎంఓ డాక్టర్ కృష్ణ, వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి

ప్రజాధనం వృథా చేస్తున్న బీఆర్ఎస్: సామ

లింగోజిగూడ: బీఆర్ఎస్ ప్రభుత్వం తన గొప్పలు చెప్పుకోవడానికి ప్రజాధనాన్ని వృథా చేస్తోందని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి విమర్శించారు. ఇంటింటికీ బీజేపీలో భాగంగా గురువారం లింగోజిగూడ డివిజన్‌లోని జానకి ఎన్‌క్లేవ్, భగీరనగర్, సాయినగర్, జనప్రియ కాలనీల్లో పాదయాత్ర నిర్వహించి కేంద్ర పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, 118 జీఓతో కాలనీల వాసులను దొంగలు చేశారని, గతంలో హుడా చేసిన లే అవుట్లోనే ప్రజలు ప్లాట్లను కొనుగోలు చేశారని, ఆ తర్వాత అది ప్రభుత్వ భూమి అని పేర్కొంటూ రిజిస్ట్రేషన్లు నిలిపివేశారన్నారు. ఆయా కాలనీల్లో అక్రమ కట్టడాలుగా గుర్తించి ఆస్తి పన్నులను రెండింతలు వేశారని, వెంటనే క్రమబద్ధీకరించి ఆస్తి పన్నును తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి రిజిస్ట్రేషన్ల పేరుతో మళ్లీ హడావుడి మొదలు పెట్టారన్నారు. ఎల్‌బీనగర్‌లో బీజేపీ జెండా ఎగరవేస్తామని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీ వైపే నిలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ భాస్కర్‌రెడ్డి, కృష్ణంరాజు, నాగరాజు, రాజ్‌కిరణ్, రాకేష్‌యాచ్ పాల్గొన్నారు.

గాయత్రినగర్ ఫేజ్-2 నూతన కార్యవర్గం ఎన్నిక



ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని గాయత్రినగర్ ఫేజ్-2 నూతన కార్యవర్గాన్ని కాలనీలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా ఆవుల రమేష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా డి.వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా చిన్నారెడ్డి, కోశాధికారిగా నరేంద్ర, సంయుక్త కార్యదర్శిగా శ్యాంరెడ్డి, సభ్యులుగా వీఎస్ఎన్ మూర్తి, గణేష్‌లను ఎన్నుకున్నారు.

యువజన కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు



చిలుక ఉపేందర్‌రెడ్డిని అరెస్టు చేసిన చైతన్యపురి పోలీసులు

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలోని నిరుద్యోగులకు వెంటనే నిరుద్యోగ భృతి చెల్లించాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ యూత్ కాంగ్రెస్ పిలుపు మేరకు నిరుద్యోగులకు భృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న యువజన కాంగ్రెస్ నాయకులను చైతన్యపురి పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, ఉద్యోగాలు ఇవ్వకుండా నోటిఫికేషన్లతో కాలయాపన చేస్తూ యువతను ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిని వెంటనే చెల్లించాలని, లేకపోతే ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరించారు అరెస్టయిన వారిలో వంగాల శ్రీకాంత్ రెడ్డి శ్రీధర్, హరి, శ్రావణ్, విజయ్, అనుదీప్, ఐతగోని శివ గౌడ్, శ్రీనాథ్, నగేష్, రాజు ఉన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి: కొప్పుల



మురుగు కుంటలా మారిన రోడ్డును పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: జీహెచ్ఎంసీ, జలమండలి సీవరేజీ బోర్డు అధికారులు సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పని చేయాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధి ఆటోనగర్ రోడ్డులోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వద్ద డ్రైనేజీ నీరు రోడ్డుపై చేరి కుంటలా మారడంతో గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో పలుమార్లు డ్రైనేజీ సమస్య తలెత్తుతోందని, ఈ విషయాన్ని పలుమార్లు ఫిర్యాదు చేసినా జీహెచ్ఎంసీ, సీఈఆర్ఎంపీ, జలమండలి సీవరేజీ బోర్డు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి సమస్యను పరిష్కరించాలన్నారు.

నాలాల వద్ద రక్షణ చర్యలు చేపట్టండి

సైదాబాద్: ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో ఉన్న నాలాల వద్ద తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం కార్పొరేటర్ జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి డివిజన్ పరిధిలోని బాలాజీనగర్, ఇంద్రప్రస్థ కాలనీల్లో పర్యటించి అక్కడి నాలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నాలాల వద్ద ప్రమాదాలు జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పలుచోట్ల నాలాల వద్ద ప్రహరీ గోడలు నిర్మించాలని, ప్రహరీ ఉన్న చోట వాటి ఎత్తును పెంచాలని అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా కాలనీల్లో ఛిద్రమైన రహదారుల మరమ్మతుకు, నూతన రహదారుల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ అన్సారీ, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

కట్నం వేధింపుల కేసులో భర్తకు ఏడాది జైలు

రంగారెడ్డి కోర్టులు: అదనపు కట్నం కోసం భార్యను మానసికంగా, శారీరకంగా వేధించిన భర్తకు ఏడాది జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ గురువారం ఎల్బీనగర్‌లోని మూడవ అదనపు మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ కొత్త రవి తీర్పు వెలువరించారు. కోర్టు ఏపీపీ గోపాల్ కథనం ప్రకారం...తాటిపాముల బాలకృష్ణ అనే వ్యక్తితో 2008లో బాధితురాలితో వివాహం జరిగింది. వివాహమైన కొద్ది రోజుల నుంచి తన భర్తతో పాటు అత్త అదనపు కట్నం కోసం వేధించేవారు. ఇల్లు కట్టుకోవడానికి పుట్టింటి నుంచి డబ్బులు తేవాలని తరచూ శారీరకంగా, మానసికంగా వేధించసాగాడు. దీంతో బాధితురాలు 2016, మే 12న సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన కోర్టు నిందితుడికి ఏడాది జైలు శిక్షను ఖరారు చేస్తూ గురువారం తీర్పు వెల్లడించింది.

ప్రభుత్వ ఖజానా నింపేందుకే జీఓ 118 : వంగ



మాట్లాడుతున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: ప్లాట్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం తీసుకొచ్చిన 118 జీఓ ప్రభుత్వ ఖజానాను నింపేందుకే అని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం కర్మన్‌ఘాట్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, యూఎల్‌సీ, అసైన్డ్ ప్లాట్ల క్రమబద్ధీకరణ గతంలో ఒక్క రూపాయికే చేస్తామని ప్రకటించి జీఓ 118 పేరిట లక్షలాది రూపాయలు ముక్కు పిండి వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. త్వరలో ఈ విషయంపై ఎమ్మార్వో కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేసి ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభింపజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ నరసింహ్మగుప్తా, బీజేపీ సీనియర్ నాయకులు సద్ది సందీప్‌రెడ్డి, భానుక రమేష్, శ్రీధర్‌గౌడ్, వేణుగౌడ్, శివ పాల్గొన్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకోండి

మలక్‌పేట: స్థానిక పోలీస్‌స్టేషన్ దళిత యువకుడు విజయ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై పోలీసులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మలక్‌పేట ఠాణాకు వచ్చిన వారు స్టేషన్ హౌస్ ఆఫీసర్ శ్రీనివాస్‌ను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విజయ్ తన భార్యను వేధిస్తున్న మజ్లిస్ పార్టీ కార్యకర్తపై ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోలేదనే మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేశాడని ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాషా, నాయకులు మోహన్, క్రాంతికిరణ్, ఓంప్రకాశ్, అంబేద్కర్, రాజేష్ పాల్గొన్నారు.

ఫారూఖ్ అరెస్ట్:

విజయ భార్యను చంపేస్తానని బెదిరింపులకు పాల్పడి, విజయ్ ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన ఫారూఖ్‌ను బుధవారం రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ గుంజి శ్రీనివాస్ తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన

మలక్‌పేట: బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్, మలక్‌పేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం మలక్‌పేట బాలుర జూనియర్ కాలేజీలో ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. టీటీఐ ఇన్‌స్పెక్టర్ జి.సంజీవ్ మాట్లాడుతూ, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా, రోడ్డుపై మొబైల్స్ వాడితే కలిగే పరిణామాలను విద్యార్థులకు వివరించారు. రోడ్డు భద్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కాలేజీ పిన్సిపాల్ పరీసా అస్మా, అధ్యాపకులు పాల్గొన్నారు.

అత్యుత్తమ సేవలకు సత్కారం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్-2 డిపోలో విధులు నిర్వహిస్తున్న పలువురు సిబ్బందిని గురువారం జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. అత్యుత్తమ సేవలు అందించిన కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు మొత్తం 22 మందిని ఆర్‌టీసీ రీజనల్ మేనేజర ఎ.శ్రీధర్ చేతుల మీదుగా సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కృష్ణమూర్తి, అసిస్టెంట్ మేనేజర్ ఉషశ్రీ, మెకానికల్ సూపరిండెంట్ మూర్తి, స్టోర్ సూపర్‌వైజర్ ఉమాపతి, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ దేశానికే ఆదర్శం: ఎమ్మెల్యే



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గురువారం సుధీర్‌రెడ్డి రాష్ట్ర మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలతో కలిసి సీఎంను అసెంబ్లీలోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఇటీవల తీసుకున్న నోటరీ ఆస్తుల క్రమబద్ధీకరణ, రైతు రుణమాఫీ, మెట్రో రైలు పొడిగింపు వంటి నిర్ణయలతో ఎంతో మందికి మేలు జరుగుతుందని తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగు నింపిన కేసీఆర్



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు, చిత్రంలో.. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా సీఎం కేసీఆర్ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపారని, ఇది చారిత్రాత్మక నిర్ణయమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించడంతో గురువారం హయత్‌నగర్ ఆర్టీసీ బస్‌డిపో 1,2లలో కార్మికులు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీని విలీనం చేయడం ద్వారా సుమారు 43 వేల మంది ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రతి కార్మికుడు కష్టపడి పని చేసి సంస్థను లాభాల బాటలోకి తీసుకురావాలన్నారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి కేసీఆర్: పెండ్యాల



ఎన్టీఆర్‌నగర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పెండ్యాల నగేష్ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పక్షపాతి అని, రైతులకు లక్ష రూపాయల రుణ మాఫీ చేసి రైతన్నల సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత ఆయనకే దక్కుతుందని బీఆర్ఎస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ అన్నారు. రైతులకు రుణమాఫీ నిధులు విడుదల చేసిన నేపథ్యంలోగురువారం ఎన్టీఆర్‌నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పెండ్యాల నగేష్ మాట్లాడుతూ, దేశం గర్వించేలా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, రైతుబంధు, రైతులకు బీమా ఇస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గం నాయకులు దుబ్బాక శేఖర్, కొండ్ర శ్రీనివాస్, రామచారి, శ్రీనివాస్‌రెడ్డి, సిద్దగోని వెంకటేష్ గౌడ్, శేఖర్, లింగస్వామిగౌడ్, ఉర్మిలారెడ్డి, అనురాధ, దేవేందర్ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో..

చాదర్‌ఘాట్: రాష్ట్రంలోని రైతుల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ అనితానాయక్ అన్నారు. రైతులకు రుణమాఫీ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మార్కెట్‌లో ఆమె రైతులతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వైస్‌చైర్మన్ భూమేష్, డైరెక్టర్లు రాము యాదవ్, నరేష్, యాదగిరి, సల్మాన్, రవికాంత్, పెద్దబాబు, లలిత, అభిషేక్, రాహుల్ పాల్గొన్నారు.

లంబాడీలకు అండగా కాంగ్రెస్: మల్‌రెడ్డి



చైతన్యపురి: రాష్ట్రంలో లంబాడీలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలని, లేదంటే మణిపూర్ తరహా ఆందోళన చేస్తామని బీజేపీ ఎంపీ సోయం బాపురావు చేసిన వ్యాఖ్యలను మల్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. గురువారం చైతన్యపురిలోని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లంబాడీ గిరిజన విభాగం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్టీ రిజర్వేషన్ విషయంలో బీఆర్ఎస్, బీజేపీ వైఖరిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని బీఆర్ఎస్ పార్టీ రెండుసార్లు అధికారంలోకి వచ్చి మోసం చేసిందని విమర్శించారు. పార్టీ ఎస్టీ సెల్ వైస్ చైర్మన్ గాంధీనాయక్, ఎల్‌బీనగర్ చైర్మన్ రమేష్ నాయక్, నాయకులు చందులాల్, కుర్ర శంకర్‌నాయక్, దీప్లా నాయక్, శ్రీనివాస్, అనితబాయ్, శ్రీనివాస్, మధునాయక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ లైన్లను శుభ్రం చేయండి

నాగోలు: కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా డ్రైనేజీ లైన్లను వెంటనే శుభ్రం చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ యాదవ్ జలమండలి అధికారులకు సూచించారు. గురువారం నాగోల్ డివిజన్ లోని అయ్యప్ప కాలనీ, కృషి నగర్ రోడ్ నెంబర్- 10 లో చాలా రోజుల నుంచి డ్రైనేజీ రోడ్ పైకి వస్తుండటంతో విషయం తెలుసుకున్న కార్పొరేటర్ గురువారం కాలనీలో పర్యటించారు. వెంటనే జలమండలి అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరింపజేశారు.